క్లుప్తంగా

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



కేసముద్రం: మండలంలోని సబ్‌స్టేషన్ తండాకు చెందిన గుగులోత్ వీరన్న అనే వ్యక్తి శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు శనివారం మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, తండావాసులు పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో చేశారు. బైక్‌ను ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ జరిగిన ఘటనపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తొర్రూరు: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరాచారి డిమాండ్ చేశాడు. శనివారం డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల మెడికల్ రియింబర్స్‌మెంట్, పీఆర్సీ ఏరియల్స్, సరెండర్ బిల్స్‌తోపాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు యాకుబ్‌రెడ్డి, చంద్రప్రకాష్, చంద్రమౌళి, యాకయ్య, శ్రీనివాస్, రమేష్, హరికృష్ణచారి పాల్గొన్నారు.

మరోసారి విచారణ చేయాలి

తొర్రూరు రూరల్: డివిజన్ కేంద్రంలోని రైతు ఆగ్రోస్, పీఏసీఎస్ సొసైటీల్లో పచ్చిరొట్ట, జీలుగ విత్తనాల విక్రయాల్లో జరిగిన అవకతవకలపై మరోసారి విచారణ చేయాలని ఏఈఓలు అరవింద్, దీపిక, జమున కోరారు. శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందించిన వారు విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీ ద్వారా అందించే జీలుగ విత్తనాల విక్రయాల్లో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆగ్రోస్ సంస్థలు, సొసైటీల నిర్వాహకులతో కేవలం ఏఈఓకు మాత్రమే సత్సంబంధాలు ఉంటాయని, ప్రతి జీలుగ బస్తా విక్రయించడం, ఆన్‌లైన్ చేయడం వంటి విషయాల్లో నిర్వాహకులు, ఏఈకే సమాచారం ఉంటుందన్నారు. తమను అనవసరంగా సస్పెండ్ చేశారని, వెంటనే మరోసారి విచారణ చేసి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

శాస్త్రీయ ఆలోచన అవసరం



కురవి: సమాజ తిరోగమన శక్తులను తిప్పికొట్టాలంటే శాస్త్రీయ ఆలోచన అవసరమని ప్రజానాట్యమండలి ఉమ్మడి రాష్ట్ర నాయకుడు, రాజకీయ విద్యా విభాగం బాధ్యుడు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని తట్టుపల్లి గ్రామంలో ప్రజానాట్యమండలి రాజకీయ శిక్షణ తరగతుల రెండోరోజు కార్యక్రమంలో మాట్లాడారు. సమాజ పురోభివృద్ధికి తోడ్పడేది కేవలం శాస్త్రీయ ఆలోచన మాత్రమే అన్నారు. సమాజాన్ని చైతన్య వంతం చేసేది పాట మాత్రమే అని తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్టనరసింహ, ఉపాధ్యక్షుడు నాగభూషణం, సహాయ కార్యదర్శి వినోద్‌కుమార్ సదానంద్, ముత్యాలు, సైదులు, రామకృష్ణ, కొమ్ము శ్రీను, ఉప్పలయ్య, మర్స వెంకన్న, హరిత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చరణ్, శ్రావణ్, దీపిక అనే విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక జీపీఏ సాధించారు. ఈమేరకు శనివారం గ్రామానికి చెందిన నవయువత యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నవయువత యూత్ అధ్యక్షుడు నలమాస సందీప్, ప్రధాన కార్యదర్శి గంధసిరి రాజేశ్, కోశాధికారి బొళ్ల హరీశ్, మల్లేష్, రామలక్ష్మణ్, వర్దెల్లి రంజిత్, చిర్ర సాయి, గంధసిరి రమేష్, జగదీష్ పాల్గొన్నారు.

చదువు సాగేదెలా?

- పూర్తికాని తెల్లబండతండా పాఠశాల భవన నిర్మాణం
- నిధులు మంజూరు కాక నిలిచిన పనులు
- నాలుగు రోజుల్లో పునఃప్రారంభం కానున్న బడులు



నిర్మాణ పనులు పూర్తికాని తెల్లబండతండా పాఠశాల



కూలిన పాఠశాల ప్రహరీ

డోర్నకల్: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న తరుణంలో మండలంలోని తెల్లబండతండా ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. సుమారు మూడేళ్ల క్రితం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా తెల్ల బండతండా పాఠశాలకు నూతన భవనం, కిచెన్ షెడ్, టాయిలెట్ల నిర్మాణం కోసం సుమారు రూ.22లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు భవనంతోపాటు టాయిలెట్లు, కిచెన్ షెడ్డు నిర్మాణం పూర్తయినా ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, విద్యుత్, వాటర్, ప్రహరీకి సంబంధించిన పనులు పూర్తి కాలేదు. భవనంలోకి ప్రవేశించేందుకు వరండాకు మెట్ల నిర్మాణం చేపట్టలేదు. వరండాతోపాటు గదుల్లో ఫ్లోరింగ్ పనులు పూర్తి కాకపోవడంతో నేలంతా మట్టితో అపరిశుభ్రంగా మారి విద్యార్థులు కూర్చునేందుకు వీలు లేకుండా ఉంది. ప్రధాన ద్వారం వద్ద ప్రహరీ, ఇనుపగేటు కూలి ప్రమాదకరంగా మారింది. పాఠశాలలో 30 మంది వరకు విద్యార్థులు ఉండగా గ్రామంలో బడిబాట నిర్వహిస్తుండటంతో మరో పదిమంది వరకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. భవన నిర్మాణం కోసం ఇప్పటి వరకు రూ.11.30లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, ఇప్పటికే అప్పులు చేసి భవన నిర్మాణం కోసం డబ్బు ఖర్చు చేసినా సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోతున్నామని సంబంధిత కాంట్రాక్టర్ చెబుతున్నాడు. అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అద్దె భవనంలో కొనసాగించాం..



భవన నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో గత సంవత్సరమంతా పాఠశాల నిర్వహణ అద్దె భవనంలో కొనసాగించాం. పాఠశాల భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఈ సంవత్సరం కూడా ఇబ్బందులు కొనసాగే అవకాశం ఉంది.

– వీరస్వామి, హెచ్‌ఎం, తెల్లబండతండా

‘ప్రశ్నించే గొంతుకను గెలిపించారు’



మాట్లాడుతున్న రాజేందర్ గౌడ్

మహబూబాబాద్ రూరల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నని గెలిపించిన పట్టభద్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఓబీసీ సెల్ జిల్లా నాయకులు ముంజాల రాజేందర్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న చావు నోట్లో తలపెట్టి యుద్ధం చేసినోడు, నిరుద్యోగుల గుండెచప్పుడై రాజ్యాన్ని ప్రశ్నించినోడు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిరుద్యోగులకు న్యాయం చేస్తుందన్నారు. మల్లన్న గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఓబీసీ సెల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లింగాల వీరభద్రంగౌడ్, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్, ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, నాయకులు వీరన్న, యుగేందర్, బీపిన్, వివేక్ పాల్గొన్నారు.

ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలపై కేసు నమోదు

తొర్రూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పచ్చిరొట్ట (జీలుగ) విత్తనాల అవకతవలపై తొర్రూరు మండలంలో ఉన్న 4 ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తొర్రూరు ప్రాంతంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాల నిర్వాహకులు, స్థానిక వ్యవసాయశాఖ అధికారులు కుమ్మక్కై సబ్సిడీతో ఇవ్వాల్సిన జీలుగ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, ఆయా గ్రామాల రైతులు కలెక్టర్, ఉన్నతస్థాయి వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం, పత్రికల్లో రావడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వ్యవసాయశాఖ ఏడీఓ శోభన్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

డీడీల నగదు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న రాజుయాదవ్

గార్ల: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల కోసం ప్రభుత్వానికి డీడీల రూపేనా చెల్లించిన నగదును వెంటనే లబ్ధిదారులకు చెల్లించాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల యూనిట్లు వస్తాయనే ఆశతో యాదవులు బయట వడ్డీకి తెచ్చి ఒక్కొక్కరు రూ.47,500 చొప్పున బ్యాంకుల్లో డీడీలు తీసి ప్రభుత్వానికి చెల్లించి ఏడాది గడుస్తున్నా, గొర్రెలు రాకపోగా డీడీలు కట్టిన నగదును సైతం లబ్ధిదారులకు ప్రభుత్వం నేటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీడీల కోసం బయట తెచ్చిన అప్పుకు వడ్డీలు కట్టలేక లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులు కట్టిన డీడీలను తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నర్సంపేట: నర్సంపేటలో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్దు, పీడీఎస్‌యూ నాయకులు విజయ్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకుడు శ్యామ్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్‌డీఓ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత భవన నిర్మాణశాఖ, కాంట్రాక్టర్లకు ఈ విద్యాసంవత్సరానికి అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కానీ కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ భవనం ప్రారంభమయ్యే విధంగా చూడాలని కోరారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న హమాలీ కార్మికులు

గార్ల: హమాలీల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ గార్లలోని సివిల్ సప్లై గోదాం ఎదుట హమాలీ కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కన్వీనర్ మాట్లాడారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, వసతిగృహాలకు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి నెల బియ్యాన్ని సరఫరా చేయడంలో హమాలీ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సివిల్ సప్లై డీటీకి అందజేశారు. ధర్నాలో కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబటి వీరస్వామి, సర్వయ్య పాల్గొన్నారు.

దాతలు సాయం చేసి ఆదుకోండి



విద్యుత్ ప్రమాదంలో గాయపడిన రవి

కొత్తగూడ: గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే రిపేర్ చేసి స్థానిక ప్రజల ఇబ్బందులు పరిష్కరించే ఔట్ సోర్సింగ్ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై చికిత్స చేయించుకోవడానికి దాతల సాయంకోసం ఎదురు చూస్తున్నాడు. కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన రాపాక రవి మూడు రోజుల క్రితం విద్యుత్ సరఫరా పరిశీలిస్తుండగా షాక్ తగిలి తీవ్ర గాయం అయిన సంగతి తెలిసిందే. షాక్ తగిలిన చెయ్యికి ఆధునిక చికిత్స చేయాల్సి వస్తుందని, లేదంటే చేయి తీసేయాల్సి రావచ్చని వైద్యులు అంటున్నట్లు బాధితుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవి చికిత్సకు కావాల్సిన డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని భార్య శోభచ కుమార్తెలు లాస్య, లహరి వేడుకుంటున్నారు. రవి హెల్పర్‌గా చేస్తే వచ్చే డబ్బులతో కుటుంబం గడుస్తుందని, ఇప్పుడు అతడికి చికిత్స ఎలా చేయించుకోవాలని బోరున విలపిస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి రవికి ఫోన్‌పే, గూగుల్ పే నంబర్ 94404 04258 సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తగూడ: నేడు ఆదివారం కొత్తగూడ, గంగారం మండలాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేష్ తెలిపారు. లక్నెపెల్లి నుంచి మండలానికి వచ్చే 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న పోటీలు

డోర్నకల్: డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలో జరుగుతున్న రెండు రాష్ట్రాల కబడ్డీ పోటీలు శనివారం రెండోరోజు హోరాహోరీగా కొనసాగాయి. ఖాజాభాయ్ మెమోరియల్ పేరుతో నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల కబడ్డీ జట్లు టైటిల్ కోసం పోటీబడ్డాయి. ఆదివారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు భీమనబోయిన సంతోష్, కొడవండ్ల యాదగిరి, చెట్టుపల్లి ఉప్పలయ్య, తోట ప్రసాద్, పగిడిపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడ: మండలంలోని గోవిందాపూర్‌లో గల గిరిజన సంక్షేమ మినీ గురుకులంలో చదువుకునేందుకు ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30, రెండో తరగతిలో 2, 5వ తరగతిలో 4 కాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామ పంచాయతీకి మాజీ సర్పంచ్ రావుల మమతరెడ్డి తన సొంత ఖర్చులతో ఫ్రీజర్ బాక్స్‌ను శనివారం అందించారు. ఈ సందర్భంగా మమత రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రూ.70వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను కొనుగోలు చేసి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, ఎంపీటీసీ గోపమ్మ పాల్గొన్నారు.

చేపలకు గిరాకీ

డోర్నకల్: మృగశిర కార్తె ప్రారంభాన్ని పురస్కరించుకుని శనివారం చేపల మార్కెట్‌లో చేపల విక్రయాలు భారీగా జరిగాయి. సెకండ్ మెయిన్ రోడ్డులోని చేపల మార్కెట్‌తో పాటు గాంధీ సెంటర్, బైపాస్ రోడ్డులో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి భారీగా చేపలను విక్రయించారు. కేజీకి రూ.200 నుంచి 250 వరకు విక్రయించారు.

రామోజీరావు మృతి తీరనిలోటు

నెహ్రూసెంటర్: పత్రికారంగంతోపాటు సామాజిక సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందిన పద్మ విభూషణ్ రామోజీరావు మృతి తీరనిలోటని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయసారథి రెడ్డి అన్నారు. శనివారం ఆయన మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథిరెడ్డి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేసుపల్లి నవీన్ పాల్గొన్నారు.

నివాళి

చిన్నగూడూరు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తన రచనల ద్వారా నిజాం సర్కార్‌పై గలమెత్తిన అక్షర యోధుడు దాశరథి రంగాచార్య వర్ధంతిని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన చిత్రపటానికి పలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గందసిరి శ్రీపాల్, వసునాది విజయ్, గుర్రం నరేష్, డిష్ శ్రీను, సాంబయ్య పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగులో బిజీబిజీగా రైతన్న



తొర్రూరు రూరల్: రైతులు ఖరీఫ్ పంట సాగులో బిజీ, బిజీగా గడుపుతున్నారు. వారంరోజులుగా వర్షాలు పడుతుండడంతో డివిజన్ పరిధిలో సుమారు 10వేల హెక్టర్లల్లో సాగు చేసేందుకు రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఉన్న చెట్లు, ముళ్ల కంపలు తొలగిస్తూ దక్కులు చదును చేస్తున్నారు. ఎరువుల షాపుల్లోకి వెళ్లి విత్తనాలను కొనుగోలు చేసి, పంటల సాగుకు రైతన్న సిద్ధమవుతున్నాడు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



మహబూబాబాద్ అర్బన్: జమాండ్లపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత పుస్తకాలు, యూనిఫాం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తామని జమాండ్లపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డు కౌన్సిలర్లు ఆదర్శ మహిళ సంఘాలు బడిబాట శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బండి ఇందిర వెంకన్న, వటం జ్యోత్స్నశివ, ఉపాధ్యాయులు రోజారాణి, మహేశ్వర్, ప్రభావతి, సరిత, మంజుల, మహిళా సంఘం చైర్మన్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: బడీడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో శనివారం అంగన్‌వాడీ, ఆశ, మహిళా సంఘాలతో కలసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుబ్బాకుల వెంకన్న, కారోబార్, వెంకన్న, అంగన్‌వాడీలు సునీత, మాధవి, వీఓఏలు నిరంజన్ పాల్గొన్నారు.

బయ్యారం: పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు తల్లిదండ్రులు ప్రభుత్వ బడిలో చేర్పించాలని కంబాలపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్ అన్నారు. మండలంలోని గురిమెళ్లలో శనివారం బడిబాట కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూపీఎస్ హెచ్‌ఎం ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, రమేష్, సక్రు, రవీందర్, లలిత పాల్గొన్నారు.

రెండురోజుల్లో పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు రెండురోజుల్లో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న సంబంధిత బాధ్యులకు సూచించారు. శనివారం మండలంలోని మేచరాజుపల్లి శివారు పీజీతండా కుంటతండా, హేమ్లతండాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీడీఓ బాలరాజు ఏఈ రాజుతో కలసి పరిశీలించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి అయ్యేలా చర్య తీసుకోవాలని హెచ్‌ఎంలకు తెలిపారు. కాగా మండలంలోని భగ్యతండా పాఠశాలలో ఎంఈఓ గుగులోతు రాము ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్‌తో కలసి పాఠశాల పనులను పరిశీలంచారు. కార్యక్రమం హెచ్‌ఎంలు రమేష్, ప్రేమ్‌చంద్, మహేందర్‌రెడ్డి, కోమల, యుగేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏటిపాలైన శ్మశానవాటిక

- శిథిలావస్థకు చేరిన గదులు
- చివరి మజిలీకి ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కొట్టుకుపోయిన శ్మశానవాటికలోని గది అడుగు భాగం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తండధర్మారం గ్రామ శివారు ఆకేరు వాగు ఒడ్డున నిర్మించిన శ్మశాన వాటిక శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వం హయాంలో ఎన్‌ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.10లక్షల వ్యయంతో శ్మశానవాటికను నిర్మించారు. కానీ గత ఏడాది ఆకేరు వాగు ఉధృత ప్రవాహానికి వాగు ఒడ్డున ఉన్న శ్మశానవాటికకు సంబంధించి మూడు గదులు అడుగుభాగం కొట్టుకుపోయింది. గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన శ్మశానవాటిక పనికిరాకుండా పోయింది. దీంతో చివరి మజిలీకి గ్రామస్తులు అరిగోస పడుతున్నారు. శ్మశానవాటిక కొట్టుకొని పోయి ఏడాది కావొస్తున్న పాలకులు గానీ, అధికారులు గానీ అటువైపు చూడకపోవడం దారుణమని గ్రామస్తులు అంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పిన పట్టించుకున్న పాపనపోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చేసేది లేక వ్యవసాయ భూములు, బీడు భూముల్లో దహన సంస్కారాలు చేస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఆకేరు వాగు ఏటిలో కొట్టుకొని పోయి శిథిలావస్థకు చేరిన శ్మశానవాటికకు మరమ్మతులు తక్షణమే చేపట్టి వినియోగంలోకి తేవాలని తండధర్మారం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామ ఎంపీటీసీ బత్తుల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాస్‌రావు కుమారుడు దుగ్యాల హరీశ్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, మల్లేశం, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



సంప్రదాయ దుస్తులతో వేడుక నిర్వహిస్తున్న మార్వాడి మహిళలు

మహబూబాబాద్ రూరల్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ సర్పంచ్ మల్గిరెడ్డి సుధాఅర్జున్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతదేశ మహేశ్వరీ మహిళా సంఘటన్ పర్యవేక్షణలో మానుకోట మార్వాడీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహేష్ నవమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో సంప్రదాయ దుస్తులతో సారీ వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ సుధఅర్జున్ రెడ్డి హాజరై మాట్లాడారు. పండుగల సందర్భంగా సంప్రదాయ దుస్తులు ధరించి మనదేశ ఔన్నత్యాన్ని అందరికి చాటి చెప్పాలన్నారు.

చెరువులో బ్లీచింగ్ పౌడర్ వేసి చేపల విక్రయం

దంతాలపల్లి: మృగశిర కార్తె ప్రారంభంరోజు చేపలు తింటే మంచి జరుగుతుందని ప్రజల్లో విశ్వాసం. శనివారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపలకు గిరాకి పెరిగింది. ఇదే అదునుగ తీసుకున్న గుత్తేదారులు చేపలు కొనుగోలు చేసి సొమ్ము గడించడం కోసం మోసాలకు తెగబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దాట్ల గ్రామంలో పెద్ద చెరువును గ్రామంలో ముదిరాజ్ సొసైటీ వారు కొన్ని సంవత్సరాల అగ్రిమెంట్ కుదుర్చుకొని చెరువును అమ్మారు. చెరువును కొన్న సదరు గుత్తేదారు మృగశిర కార్తెను పురస్కరించుకొని శనివారం చేపలు పట్టి దాట్ల గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో అమ్మాడు. ఈక్రమంలో చేపలు కొనుగోలు చేసిన ప్రజలు చేపలను శుభ్రం చేస్తున్న క్రమంలో చేపల పైభాగం ఊడిపోవడం, చేప లోపలి భాగంలో నలుపు రంగు రావడంతో గుత్తేదారుతో గొడవకు దిగారు. చెరువులో బ్లీచింగ్ బ్యాగ్‌లు చూసిన ప్రజలు వాగ్వాదం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సర్ది చెప్పారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
వి. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ : 9010144453
Office mail : wglsakshiadvt@gmail.com